క్లుప్తంగా

'ప్రజావాణి'కి విధిగా హాజరుకావాలి

కోడేరు: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు ఏమైనా సమస్యలుంటే ప్రజావాణిలో పరిష్కరించుకోవాలని సూచించారు. అధికారులు గైర్హాజరైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

నేడు శ్రీనివాసుడి కల్యాణోత్సవం

కోడేరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రాఘవేంద్ర శర్మ తెలిపారు. సోమవారం భక్తి గీతాపాలన, అనమాచార్య సంకీర్తనలు, మంగళవారం సత్యనారాయణస్వామి వ్రతం, పల్లకీ సేవ, మంగళహారతి, రథోత్సవం, తదితర పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి బీరప్ప ఉత్సవాలు

తెలకపల్లి: మండల కేంద్రంలో ఈనెల 6వ తేది నుంచి బీరప్ప పండుగలు జరగనున్నట్లు మేకల వంశస్తులు తెలిపారు. ఈ మేరకు వారం రోజుల పాటు బీరప్ప, ఎల్లమ్మ పండుగలను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పండుగలలో వివిధ కార్యక్రమాలతో పాటు బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు పాలెంకు అహోబిళ మఠాధిపతి రాక

బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి అహోబిళ మఠాధిపతి స్వామిజీ రానున్నారని ఆలయ కమిటీ చైర్మన్ జున్న శేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మఠాధిపతుల మంగళ శాసనాలతో దివ్య ఆశీర్వచనాలు, దివ్య సందేశం ఇవ్వనున్నారన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు పవిత్రమైన పూజలు తీసుకుని రావాలని కమిటీ సభ్యులు సూచించారు.

8 నుంచి బండలాగుడు పోటీలు

బిజినేపల్లి: ఆనందగిరి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో ఫిబ్రవరి 8వ తేది నుంచి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ బాలీశ్వర్ తెలిపారు. అలాగే జాతీయ స్థాయిలో ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ఆయా ప్రాంతాల నుంచి పోటీదారులు పాల్గొన్నాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని విశ్వశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు గాయత్రి జూనియర్ కళాశాల అధ్యాపకులు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. గాయత్రి విద్యాసంస్థల నిర్వాహకులు సురగొని శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలను ఆదివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయనను పలువురు సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ జెండా ఆవిష్కరణ

కల్వకుర్తిరూరల్: రాబోయే ఎన్నికల్లో సత్తా చాటుదామని భవిష్యత్ వైఎస్సార్‌టీపీదేనని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ చీమర్ల అర్జున్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఎంగంపల్లిలో పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధన వైఎస్ షర్మిలకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, తిరుపతి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

చారకొండ: మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లిలో ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఆదివారం మండల సంఘం అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులు సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అప్పిసు లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా సైదులు, ప్రధాన కార్యదర్శిగా మధు, సహాయ కార్యదర్శిగా తిరుపతయ్య, కోశాధికారిగా హుస్సేన్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, శ్రీను, దేవేందర్, శ్రీశైలం ఉన్నారు.

విశ్వబ్రాహ్మణులకు అండగా నిలుస్తా

కల్వకుర్తిరూరల్: విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం వారికి అండగా నిలుస్తానని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. ఆదివారం పట్టణంలోని యూటాఎఫ్ భవనంలో విశ్వబ్రాహ్మణుల ఉద్యోగుల సేవా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 10వ తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో మంచి ప్రతిభ చూపిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందించడంతోపాటు సన్మానించారు. చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైస్ చైర్మన్ శాహెద్, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు యాదగిరాచారి, ప్రధానోపాధ్యాయులు జగన్మోహనాచారి పాల్గొన్నారు.

వైభవం.. రథోత్సవం

- కొనసాగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా వేంకటేశ్వరస్వామి అలివేలమంగసమేత విగ్రహాలను పల్లకీలో మోస్తూ డోలు, డప్పులతో నాట్యం వేస్తూ కోలాటాలతో స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధి కోసం ఆలయ సమీపంలో ఏసీడీసీ నిధుల నుంచి రూ.20లక్షల వ్యయంతో మినీ కల్యాణ మండపానికి భూమిపూజ చేశారు. అంతేకాకుండ ఆలయ అభివృద్ధి కోసం రూ.50 లక్షల ప్రతిపాదనలు పంపినట్లుగా తెలియజేశారు. యువకులు ఓం నమో వెంకటేశ్వరాయ .. గోవిందా.. గోవిందా అంటూ స్వామివారి రథోత్సవాన్ని ఉత్సాహంగా లాగారు.

ప్రత్యేక బందోబస్తు

రథోత్సవం సందర్భంగా సీఐ యాలాద్రి, ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పెద్ద ఎత్తున సిబ్బందితో రథోత్సవాన్ని ముందుకు సాగించారు.

హాజరైన రాజకీయ నాయకులు..

రథోత్సవానికి కొల్లాపూర్ నియోజకవర్గ రాజకీయ నాయకులు హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు అభిలాష్ రావు, బీజేపీ నాయకులు ఏలేని సుధాకర్‌రావు, ఆలయ ట్రస్ట్ చైర్మన్ జీవన్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ సువర్ణ, మాజీ సర్పంచ్‌లు రాజేష్, సురేందర్‌గౌడ్, కోట్ల సురేందర్‌గౌడ్, ఎంపీటీసీ సుమలతశేషు, శేషు, రమణ, కోఆప్షన్ మెంబర్ మతీన్, విజయరామారావు, ఎస్‌కె ఖాజా, పోతుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


వేంకటేశ్వరస్వామి తేరు లాగుతున్న భక్తులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి

సీతారామాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

మన్ననూర్: మాచారంలో గత 5 రోజులుగా శ్రీ సీతారామాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం గోపూజ, హోమాలు, అభిషేకాలు, విగ్రహాల ఆవిస్కరణ, ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, శిఖర దర్శనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి రామాంజనేయ మహత్యం నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. విగ్రహ దాత జలంధర్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన పూజల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రముఖులతో పాటు నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, బీజేపీ అచ్చంపేట ఇన్‌చార్జ్ సతీష్ మాదిగ, అమ్రాబాద్, కల్వకుర్తి జెడ్పీటీసీలు డాక్టర్ అనురాధ, భరత్‌కుమార్, ఎంపీపీ శ్రీనివాసులు, పోషం గణేష్ పాల్గొన్నారు. అమ్రాబాద్ సీఐ ఆదిరెడ్డి పర్యవేక్షణలో అమ్రాబాద్, ఈగలపెంట, అచ్చంపేట పోలీసులు ఎంతో కృషి చేశారు.

వైద్య శిబిరం..

రెడ్‌క్రాస్, యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో మన్ననూర్, పదర పీహెచ్‌సీల సహకారంతో రెండు రోజులుగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, శ్రీధర్, వైద్యాధికారి గౌతం, సిబ్బంది సుజాత, అంజమ్మ, ఝాన్సీ, అంజలి పాల్గొన్నారు.


నిర్వాహకులను శాలువాతో సత్కరిస్తున్న ప్రముఖులు

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

కందనూలు: జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో మాఘపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వేద బ్రాహ్మణులతో శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాఘమాసం పౌర్ణమి ఆదివారం రావడం ఎంతో విశిష్టత అని, ఈరోజు వ్రతాలు చేయడం ఎంతో పుణ్యఫలితం ఉంటుందన్నారు. అనంతరం ఆలయంలో ఉదయం పరమశివుడికి భక్తులచే అభిషేకాలతో పాటు రామాలయ భజన మండలి వారిచే ప్రత్యేకంగా భజనలు నిర్వహించారు. స్వామి వార్లకు నివేదించిన ప్రత్యేక తీర్థప్రసాదాలను వేద ఆశీర్వాదాలు అందజేశారు. రామాలయ అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో రామాలయ అన్నదాన కమిటీ సభ్యులు అర్థం రవీందర్, మల్లేష్, మన్నెపు రెడ్డి, గొల్ల రాములు, రమాదేవి, భక్తులు పాల్గొన్నారు.


సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు

తాడూరు: మండలంలోని శిర్సవాడ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి జగదీశ్వరాచార్య ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, హోమం, సహస్రనామ పూజా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఐతోలుకి బొల్లం గోపాల్‌గౌడ్ ఆర్థిక సహకారంతో పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

మహాపాదయాత్ర వాల్‌పోస్టర్ విడుదల



అచ్చంపేట రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లేష్ డిమాండ్ చేశారు. ఈనెల 12న పాలకుర్తి నుంచి పట్నం వరకు మహాపాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. జీఓ 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, ప్రమాదబీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, వేమయ్య, ధర్మానాయక్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి


తాడూరు-ఉప్పునుంతల బీటీ రోడ్డు

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి తాడూరు వరకు ఉన్న బీటీ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల కంప చెట్లు కమ్ముకోవడంతోపాటు కొన్ని చోట్ల బీటీ పూర్తిగా లేచిపోయింది. దీంతో రోడ్డుపై వెళ్లడానికి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మూల మలుపుల వద్ద చెట్లు కమ్ముకొని ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక తృటిలో ప్రమాదాలు తప్పిపోతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి ఈ రోడ్డు మార్గంలోనే తాడూరు, కొరటికల్, వెల్టూర్, లత్తీపూర్, గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల వరకు ఎక్కువ గ్రామాలకు వెళ్లడానికి అనువుగా ఉంది. దీంతో ప్రతి నిత్యం ఈ మార్గంలో వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఆరేళ్ల క్రితం బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసి తిరిగి పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయడానికి శ్రద్ధ తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కల్వకుర్తిరూరల్: అన్నదానం మహాదానం అని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో దాత ఈశ్వరయ్య సోదరుల సహకారంతో పట్టణంలోని పశువుల సంతలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం ఎంతో గొప్పదని చైర్మన్ అన్నారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కల్మిచర్ల రమేష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీధర్, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీశైలం, కోశాధికారి వెంకటేష్, కిషన్, జగదీశ్వర్, అప్పాయిపల్లి శ్రీను, గోవిందు, రఘు, హరీష్ పాల్గొన్నారు.

తిర్మలాపూర్‌లో పెద్దమ్మతల్లి బోనాలు

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్‌లో ఆదివారం సాయంత్రం యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన యాదవుల కులదైవం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వారం రోజులుగా నిర్వహిస్తారన్నారు. ఈ ఉత్సవాల్లో యాదవ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం'

వంగూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరిగి ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పండిత్‌రావు, ఎంపీటీసీ సభ్యులు రమేష్‌గౌడ్, నాయకులు యాదగిరిరావు, జనార్దన్, శివశంకర్, రఫీ, శ్రీశైలం, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వాముల పడిపూజ

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్‌లో శివస్వాములు ఆదివారం పడిపూజ, శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. అనంతరం శివస్వాములు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగినేని అభిలాష్‌రావు, శ్రీకృష్ణ, శివస్వాములు, రాముడు, శివయ్య, కర్రెన్న, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: అర్హులైన నిరుపేదలందరికీ డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని, స్థలాలు ఉన్న వారికి రూ.3 లక్షలు అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ కాలనీల్లో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా నాయకురాలు కంది కొండ గీత, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, లబ్ధిదారులు ఎల్లస్వామి, రామాంజనేయులు, మల్లయ్య, లక్ష్మయ్య, ఎల్లమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

కల్వకుర్తి: మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ప్రజాసంఘాల పోరాట వేదిక అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని వార్డులు, గ్రామాలలో సర్వే నిర్వహించారు. పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 6వ తేదీన ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఇంటి స్థలం ఉన్న ప్రతి పేద కుటుంబానికి డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు దేశ్యానాయక్, శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఇందిరానగర్, మహేంద్రనగర్, గోకుల్‌నగర్, చింతలబస్తీ, పెరికవాడలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మల్లేష్, తిరుపతమ్మ, భాస్కర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలపై రైతుల ఆందోళన



కల్వకుర్తిరూరల్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 24 గంటల కరెంట్ ఇవ్వాలని కరెంట్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఆదివారం మండలంలోని వెంకటాపూర్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కరెంట్ కోత సమస్యలు పెరుగుతున్నాయన్నారు. యాసంగి పంటలను దృష్టిలో ఉంచుకొని కోతలు లేకుండ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కొల్లాపూర్: యోగా ద్వారానే మానసిక ప్రశాంతత సాధ్యమవుతుందని పతంజలి యోగా శిక్షకులు అలువాల అర్జున్‌గౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక పట్టణంలోని ముదిరాజ్ సంఘ భవనంలో యోగా శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు పలు యోగా ఆసనాలను వేసి చూపించారు. అలాగే యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఆయనను ముదిరాజ్ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంతోమందికి యోగా ద్వారా ఆరోగ్యాన్ని అందిస్తున్నారని, ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు హరిప్రసాద్‌నాయుడు, తూర్పు కుమారస్వామి, వేములవాడ రాజేష్, నీరజ, రాజేశ్వరీ ఉపాధ్యాయులు నారాయణ, బషీర్, శీనయ్య, చెన్నయ్యలున్నారు.


అర్జున్‌గౌడ్‌ను సత్కరిస్తున్న నాయకులు

సంతు రవిదాసుకు నివాళి

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సంతు రవిదాసు జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. పార్టీ దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు ముస్లిం రాజుల దండయాత్ర మరోపక్క అంటరానితనం పేరుతో దేశం అల్లకల్లోలం అవుతున్న తరుణంలో సంతు రవిదాసు అంటరానితనం రూపుమాపేందుకు తన జీవితాన్ని ధారపోసేందుకు హైందవ సమాజాన్ని సంఘటితం చేసేందుకు పోరాడారని అన్నారు. కార్యక్రమంలో కృష్ణగౌడ్, సురేందర్‌గౌడ్, శివకుమార్, చందు, పరుసరాములు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆదివారం సంత్ రవిదాస్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివకుమార్, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, శివ, గణేష్, శేఖర్, శివ, రామునాయక్, శివస్వాములు తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న యాదగిరి

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

వెల్దండ: గిరిజనుల ఆరాధ్య దైవం, బంజారాల గురువు సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి సెలవుదినంగా ప్రకటించాలని లంబాడీ ఐక్యవేదిక స్టేట్ కోఆర్డినేటర్ గుగులోతు రమేష్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంబాడీలు ఐక్యంగా ఉండి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు. లంబాడీలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజినాయక్, శంకర్‌నాయక్, నాయకులు శంకర్‌నాయక్, వీరస్వామి, రమేష్‌నాయక్, రాజు, శ్రీను, కాడురామ్‌నాయక్, తారాసింగ్, దేశ్యనాయక్, సాజ్యానాయక్, రవి, రమేష్ ఉన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

టీయూడబ్ల్యూజే మహాసభను జయప్రదం చేయండి

కందనూలు: జిల్లా కేంద్రంలో రూబీ గార్డెన్‌లో మంగళవారం ఉదయం 10గంటల జరిగే టీయూడబ్ల్యూజే ఉమ్మడి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లాఖాన్ కోరారు. జర్నలిస్టుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న ఏకైక జర్నలిస్టు యూనియన్ అని అన్నారు. ఉమ్మడి జిల్లా మహాసభలకు ప్రతి జర్నలిస్టు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందు ఉయ్యాలవాడ సమీపంలో జర్నలిస్టులకు కేటాయించిన నాలుగు ఎకరాల స్థలంలో జర్నలిస్టు భవన్‌కు మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, బీరం హర్షవర్ధన్ రెడ్డి, జైపాల్ యాదవ్, అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల దామోదర్ రెడ్డిలు పూజ నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం పట్టణంలోని రూబీ గార్డెన్‌లో జరిగే మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని వారు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు చందు నాయక్, దినకర్ రావు, నాగశేషయ్య, అహ్మదుల్లా ఖాన్, నేషనల్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఎండీ రావుఫ్, నాగ శేషయ్య, అచ్చంపేట శీను, చంద్రశేఖర్ రావు, రాజేష్ గౌడ్, తిప్పర్తి విజయ్‌కుమార్, నాయకులు ఉమా శంకర్, పి.వెంకటస్వామి, ఖానాపురం ప్రదీప్ పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

అచ్చంపేట రూరల్: మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మిషన్ భగీరథ కార్మిక సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాము కోరారు. ఆదివారం అచ్చంపేట సీఐటీయూ కార్యాలయం వద్ద ఈనెల 7న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు మల్లేష్, మిషన్ భగీరథ కార్మికులు కుమార్, సురేష్, శేఖర్, వాల్య, అంజి, రమేష్, జగన్, మల్లేష్, రామకోటి, శ్రీను, తిరుపతయ్య పాల్గొన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మికులు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కల్వకుర్తిరూరల్: జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా బహుజన సమాజ్‌పార్టీ అధ్యక్షుడు యోసేపు అన్నారు. ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాసుయాదవ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే శాసనసభ ఎన్నికల దృష్ట్యా గ్రామగ్రామాన పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కల్వకుర్తి అసెంబ్లీ ఉపాధ్యక్షుడిగా సత్యానందయాదవ్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, ఆంజనేయులు, రేణుక, మల్లేశ్, శ్రీను, శ్రీశైలం, సాయిబాబ, రాజు పాల్గొన్నారు.


నియామకపత్రం అందజేస్తున్న యోసేపు


ఆయిల్‌పాం సాగుకు రైతుల మొగ్గు

- నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల్లో సాగు
- 2వేల ఎకరాల్లో సాగు కోసం కసరత్తు

పెద్దకొత్తపల్లి: రైతులు సాంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి పలికి వాణిజ్య పంటలైన ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఇప్పటి వరకు ఆయిల్‌పాం సాగు చేపట్టారు. ఈ పంట సాగు 30 ఏళ్ల వరకు రైతుకు ఆదాయం అందిస్తుంది. కొల్లాపూర్ నియోజకవర్గంలో మామిడి తోటలు అధికంగా ఉన్నాయి. అయితే గత 4 ఏళ్ల నుంచి మామిడి దిగుబడి తగ్గిపోవడంతో రైతులు మామిడి తోటల పెంపకానికి స్వస్తి పలికి ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పాం సాగు చేపట్టే రైతులకు సబ్సిడీపైన మొక్కలను డ్రిప్ అవకాశం కల్పించడంతో రైతులంతా ఈ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు కోడేరులో 400 ఎకరాలు, కొల్లాపూర్ 200 ఎకరాలు, పెద్దకొత్తపల్లి 200 ఎకరాలు, పెంట్లవెల్లి మండలంలో 200 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలను నాటారు. నియోజకవర్గంలో ఉన్న భూములన్నీ ఆయిల్‌పాం పంటకు అనుకూలంగా ఉండడంతో సాగు చేసేందుకు రైతులంతా ముందుకొస్తున్నారు. పంటను ఏర్పాటు చేసే రైతులంతా కొత్తగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి పంట సాగు కోసం రైతులకు అనుమతులను ఇస్తున్నారు. మరో రెండు వేల ఎకరాల్లో సాగు చేసేందుకు ఉద్యానవన అధికారులు కసరత్తులు చేస్తున్నారు.


చంద్రకల్‌లో రైతు సాగు చేసిన ఆయిల్‌పాం తోట

6 ఎకరాల్లో మొక్కలు నాటాను



మాకున్న 8 ఎకరాల పొలంలో ప్రస్తుతం 6 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటాను. ప్రభుత్వం సబ్సిడీపైన మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించింది.

– పర్వతాలు, రైతు, పెద్దకొత్తపల్లి

దరఖాస్తు చేసుకోండి

నియోజకవర్గంలో ఆయిల్‌పాం సాగుకు అనుకూలంగా ఉంది. నీటి వసతి ఉన్న రైతులంతా దరఖాస్తులు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తులను ప్రభుత్వానికి పంపించి రైతులకు ఆయిల్‌పాం మంజూరయిన వెంటనే మొక్కలు, డ్రిప్ సౌకర్యం కల్పిస్తాం.

– లక్ష్మణ్, ఉద్యానవన అధికారి కొల్లాపూర్